నమస్తే తెలంగాణ

హనుమకొండ

5 | గురువారం 1 ఆగస్టు 2024 | HANUMAKONDA




బ్యాంకు ముందు వేచి చూస్తున్న రైతులు

# సర్వర్ డౌన్.. రైతుల పరేషాన్

**గూడూరులో ఇబ్బందులు పడ్డ రైతులు, కస్టమర్లు**

గూడూరు, జూలై 31: స్థానిక యూనియన్ బ్యాంకులో బుధవారం నెట్‌వర్క్ లేకపోవడంతో కస్టమర్లు, రైతులు ఇబ్బందులు పడ్డారు. బ్యాంకు ముందున్న గేట్‌కు సర్వర్ సమస్య ఉందని కస్టమర్లు గమనించాలని బ్యాంకు ఉద్యోగులు బోర్డు పెట్టారు. దీంతో లావాదేవీలు చేసేందుకు కస్టమర్లు ఇబ్బందులు పడ్డారు. రుణమాఫీ పొందిన రైతులు ఎంత మొత్తంలో అయ్యిందో తెలుసుకోవాలని, రుణమాఫీకి సంబంధించిన కటాఫ్ డేట్ నుంచి ఈనెల వరకు వడ్డీ చెల్లించాలనుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

హనుమకొండ, జూలై 31 : స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు జరిగాయి. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ రిజిస్ట్రార్ హరికోట్ల రవి హైదరాబాద్ మార్కెట్ వాల్యూ అండ్ ఆడిట్ రిజిస్ట్రార్‌గా బదిలీ కాగా, ఆయన స్థానంలో ఆదిలాబాద్ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ డీ ఫణీందర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ల విభాగంలో జిల్లా నుంచి డీఐజీ ఆఫీసు సూపరింటెండెంట్ డీ సుజాతను ఎస్ఆర్ జగిత్యాల్‌కు, జనగామ ఎస్ఆర్‌వో టీ సంపత్‌కుమార్‌ను జేటీ ఎస్ఆర్-1 ఆర్‌వో ఖమ్మంకు, వరంగల్ ఆర్‌వో అమ్జద్‌ను స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్ఆర్‌గా, ఆర్ రాజును మధిర ఎస్ఆర్‌గా, ఎస్ఆర్ ఎంవీ అండ్ ఆడిట్ వరంగల్ కే మోజెస్ భాస్కర్‌ను ఎస్ఆర్ సత్తుపల్లికి, ఏఆర్‌సీ వరంగల్ వీ వేణుమాధవ్‌ను ఎస్ఆర్ కొత్తగూడెంకు, వరంగల్ ఫోర్ట్ ఎస్ఆర్‌వో ఏ కార్తీక్‌ను ఏఆర్‌సీ ఖమ్మంకు, భీమదేవరపల్లి ఎస్ఆర్‌వో టీ భాగ్యలక్ష్మిని ఖమ్మం ఎంవీ అండ్ ఆడిట్‌కు, ఎస్ఆర్‌వో వరంగల్ రూరల్ ఎండీ ఖాజామొయినుద్దీన్‌ను ఎస్ఆర్ కల్లూర్‌కు, ఎస్ఆర్‌వో నర్సంపేట ఎస్ రామకృష్ణారెడ్డిని ఖమ్మంకు, ఎస్ఆర్‌వో వర్ధన్నపేట జే అరుణను ఎస్ఆర్ ఖమ్మం రూరల్‌కు బదిలీ చేశారు. ఎస్ఆర్ కూసుమంచి జే రామనర్సింహారావును వరంగల్ ఆర్‌వో ఆఫీసుకు, జగిత్యాల ఎస్ఆర్‌వో జే కిషన్‌నాయక్‌ను భీమదేవరపల్లి ఎస్ఆర్‌వోగా, హెడ్ ఆఫీస్ సూపరింటెండెంట్ ఏ తిరుమల్‌రావును వరంగల్ ఎంవీ అండ్ ఆడిట్‌కు బదిలీ చేశారు.

అలాగే మంచిర్యాల ఎస్ఆర్‌వో ఆర్ రామును ఎస్ఆర్ భూపాలపల్లికి, హెడ్ ఆఫీస్ సూపరింటెండెంట్ ఎం దిలీప్‌చారిని ఎస్ఆర్ ములుగుకు, కొత్తగూడెం ఎస్ఆర్‌వో జీ రాంకుమార్‌ను వరంగల్ డీఐసీ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా, ఇల్లందు ఎస్ఆర్‌వో బీ సైదులును వరంగల్ రూరల్ ఎస్ఆర్‌గా, ఖమ్మం ఎంవీ అండ్ ఆడిట్ ఎస్ఆర్ డీ సుజన్‌కుమార్‌ను పరకాల ఎస్ఆర్‌గా, ఖమ్మం ఏఆర్‌సీ పీ యామినిని వరంగల్ ఏఆర్‌సీగా, మధిర ఎస్ఆర్‌వో ఏ గిరిధర్‌ను నర్సంపేట ఎస్ఆర్‌గా, ఖమ్మం రూరల్ ఎస్ఆర్‌వో జే నరేంద్రను వరంగల్ ఫోర్ట్ ఎస్ఆర్‌గా, కల్లూరు ఎస్ఆర్‌వో డీ ఆనంద్‌ను వరంగల్ ఆర్‌వో ఆఫీసుకు, సత్తుపల్లి ఎస్ఆర్‌వో వీ ప్రభాకర్‌రావును వర్ధన్నపేట ఎస్ఆర్‌వోగా బదిలీ చేశారు.

## ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అనసూయ

కాశీబుగ్గ, జూలై 31: వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అనసూయ బదిలీపై వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బదిలీల్లో భాగంగా హైదరాబాద్ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ అనసూయను ఇక్కడకు బదిలీ చేశారు. అలాగే, ప్రసూతి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సులోచన, ప్రొఫెసర్లు రవీందర్ గౌడ్, శైలేష్‌నాథ్ సక్సేనా, అసోసియేట్ ప్రొఫెసర్లుగా సంధ్యారాణి, శ్రీకాంత్, వెంకటరమణ, ఏ శ్రీధర్ హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వచ్చారు. వరంగల్ నుంచి ప్రొఫెసర్లు సులోచన, నాగలక్ష్మి, విజయగణేశ్‌రెడ్డి, ఏ శ్రీధర్, బాబురావు హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.




ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ

## వరంగల్ కలెక్టర్ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

**ఎవరూ స్పందించవద్దు : సత్యశారద**

గిర్మాజీపేట, జూలై 31 : తన పేరుతో వస్తున్న ఫేక్ మేసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని వరంగల్ కలెక్టర్ సత్యశారద ప్రజలను కోరారు. శ్రీలంక నుంచి +9478497715 నంబర్‌తో సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్‌లో కలెక్టర్ సత్యశారద పేరుతో నకిలీ ఖాతా సృష్టించి పలువురి నుంచి డబ్బులు డిమాండ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకొని కలెక్టర్ తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పేరుతో ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వొద్దని సదరు నంబర్ నుంచి ఎవరికైనా కాల్ వస్తే బ్లాక్ చేయాలని కలెక్టర్ సూచించారు.

## మాఫీ కోసం ఎదురుచూస్తున్నాం..



దేవరుప్పుల, జూలై 31: సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు చెప్పిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న దానికి ఆస్మాన్ ఫరక్ ఉంది. పంట రుణం మాఫీ కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూసుడే సరిపోతాంది. ఇప్పటి వరకు సగం మందికి కూడా రుణమాఫీ కాలే. నాకు దేవరుప్పుల యూనియన్ బ్యాంకులో రూ. 1.40 లక్షల పంట రుణం ఉంది. నిన్న ప్రకటించిన మాఫీ లిస్ట్‌లో నా పేరు లేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే మాఫీ కాలేదని చెప్పారు. అసలేం జరుగుతున్నదో తెలుస్తలేదు. రుణమాఫీ కోసం రైతులంతా పనులు వదిలిపెట్టి బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుడే సరిపోతాంది.

– బొజ్జం పెద యాకయ్య, రైతు, దేవరుప్పుల

## కుక్కలు, కోతులను నియంత్రించండి

**మండలిలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు**



మహబూబాబాద్, జూలై 31(నమస్తే తెలంగాణ): కుక్కలు, కోతులతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వాటిని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు కోరారు. బుధవారం శాసనమండలిలో ఆయన ప్రసంగించారు. మహబూబాబాద్ జిల్లాలో ఇటీవల ఒక ఆర్పీ, మరిపెడలో ఒక కౌన్సిలర్ కుక్కకాటుకు గురై ఆ తర్వాత అనారోగ్యంతో మృతిచెందారని ఆయన గుర్తుచేశారు. కోతులను నియంత్రించేందుకు కుక్కలను పెంచితే అవి రెండూ కలిసిపోయి ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయని వివరించారు. అలాగే వాటి బెడదతో రైతులు వేరుశనగ, కూరగాయలు, పండ్ల తోటలు వేయడం మానేశారని పేర్కొన్నారు. రోడ్డు మీద ప్రజలు నడవాలంటేనే భయపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కుక్కలు, కోతులను నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సభ దృష్టికి తీసుకెళ్లారు.



గొత్తికోయలకు వైద్యం చేసేందుకు జారుడు బండ వాగు దాటి వెళ్తున్న వైద్య సిబ్బంది

# కాలినడకన.. వాగులు దాటుతూ

- గొత్తికోయగూడెం గ్రామస్తులకు వైద్య సేవలందించిన డాక్టర్లు, సిబ్బంది
- 25 మందిని పరీక్షించి మందుల అందజేత

గోవిందరావుపేట, జూలై31: మూడు వాగులు దాటి..7 కి.మీ నడిచి గొత్తికోయగూడెం గ్రామస్తులకు వైద్య సేవలందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అనూష, సబ్ యూనిట్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ జంపయ్య, ఆశ వర్కర్ సమత బుధవారం చల్వాయి గ్రామపంచాయతీ పరిధిలోని కన్నాయిగుంపు గొత్తికోయగూడేన్ని సందర్శించారు. ఉదయం 8.30కు వెళ్లిన వైద్య సిబ్బంది రెండు గంటల పాటు ప్రయాణం చేశారు. వలుపల వాగు, జారుడు బండ వాగు, వట్టి వాగులను దాటుకుంటూ రాను పోను 14 కిలోమీటర్లు కాలినడకన వెళ్లారు. 15 కుటుంబాలను పరీక్షించి, అనారోగ్యంగా ఉన్న 25 మందికి వైద్యం చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ డీఎంహెచ్‌వో అప్పయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రకాంత్ ఆదేశాల మేరకు గూడెంను సందర్శించామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు దోమల నివారణకు దోమ తెరలను వాడాలని గొత్తికోయలకు సూచించినట్లు తెలిపారు.



గొత్తికోయగూడెంలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

**● సీజనల్ అలర్ట్**

# పల్లెకు జ్వరం వైద్యం దూరం !



నర్సింహులపేట: కొమ్ములవంచలో జ్వర బాధితుడికి సెలైన్ బాటిల్ ఎక్కిస్తున్న దృశ్యం

## సీజనల్ వ్యాధులతో అల్లాడుతున్న జనం

**సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ వైరల్ ఫీవర్ అందరినీ వణికిస్తున్నది. ముఖ్యంగా మారుమూల పల్లెలు, తండాలు, గూడేల్లో జ్వరాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నా స్థానికంగా వైద్యం అందక ప్రైవేట్ దవాఖానలకు పరుగులు పెట్టాల్సి వస్తున్నది. అంతుచిక్కని జ్వరాలు, నొప్పులతో ఊరికి ఊరే మంచంపట్టగా, చాలాచోట్ల గ్రామానికి సగటున 10 మంది జ్వరపీడితులే ఉన్నట్లు స్పష్టమవుతోంది. వర్షాలతో మురుగు నీరు నిలువడం, దోమలు, ఈగలు వృద్ధి చెందడం, కలుషిత నీటి ప్రభావం, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడం ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే స్థానిక వైద్యాధికారులు నామమాత్రంగా వచ్చి వెళ్తున్నారు తప్ప వైద్య శిబిరాలు నిర్వహించడం లేదని, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం లేదని.. ఇప్పటికైనా జ్వరాలను నియంత్రించాల్సిన అవసరమున్నదని ప్రజలు కోరుతున్నారు.**

*- నర్సింహులపేట/ఏటూరునాగారం/ కమలాపూర్, జూలై 31*

- స్థానికంగా వైద్యం అందక ప్రైవేట్‌కు పయనం
- తండాలు, గూడేల్లో ఊరికి 10 మంది బాధితులే
- భీంపల్లిలో అంతుచిక్కని జ్వరాలతో సతమతం
- దోమల వ్యాప్తి, మురుగునీటితో తప్పని ఇబ్బందులు
- పలుచోట్ల నాటు వైద్యాన్ని నమ్ముకుంటున్న ప్రజలు
- వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తేనే కోలుకునే అవకాశం



నర్సింహులపేట: రోడ్డుపై నిలిచిన బురద నీరు



జ్వరంతో మంచంలో ఉన్న బాలుడు బీమా

### గొత్తికోయగూడేల్లో అదే తీరు..

జ్వరాలతో గొత్తికోయగూడెంవాసులు సతమతమవుతున్నారు. వైద్యశాలలు దూరంగా ఉండడంతో సరైన చికిత్స పొందలేకపోతున్నారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు దోమలు వృద్ధి చెందడం, సరైన తాగునీటి సదుపాయం లేక సమీప వాగుల్లో చెలిమెల నీటినే తాగడం ఇందుకు కారణమని తెలుస్తోంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి సమీపంలోని చింతలమోరి గ్రామానికి చెందిన కుంజం బీమా అనే 4వ తరగతి విద్యార్థి వారం రోజులుగా జ్వరం, కడుపులో మంటతో బాధపడుతూ ఇటీవల వైద్యం కోసం ములుగు ప్రభుత్వ దవాఖానకు వెళ్లాడు. అయితే గోలీలు ఇచ్చారని వాడినా జ్వరం తగ్గకపోవడంతో ఇంటి వద్దే ఉన్నట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఇక పస్రా సమీపంలో మండలతోగు గొత్తికోయ గ్రామానికి చెందిన మడకం చుక్కమ్మ కూడా 15రోజులుగా జ్వరంతో బాధపడుతూ వైద్యశాలకు వెళ్లగా తగ్గడం లేదంటున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందినప్పటికీ తగ్గకపోవడంతో నాటు వైద్యంపై ఆధారపడుతున్నట్లు తెలుస్తోంది. ఇలా పలు గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యాధికారులు గొత్తికోయగూడేల్లో శిబిరాలు ఏర్పాటుచేసి సర్కారీ వైద్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరమున్నది.

### మంచంపట్టిన భీంపల్లి

- కీళ్ల నొప్పులు, వింత జ్వరాలతో తల్లడిల్లుతున్న ప్రజలు
- జ్వర పీడితుల నుంచి రక్త నమూనాల సేకరణ
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : డీఎంహెచ్‌వో సాంబశివరావు.. ఇంటింటా జ్వర సర్వే పరిశీలన




జ్వరంతో బాధపడుతున్న రోగుల రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామంలో కీళ్ల నొప్పులు, వింత జ్వరాలతో గ్రామస్తులు తల్లడిల్లుతున్నారు. ఇరవై రోజులుగా గ్రామంలో జ్వరాలు వస్తుండడంతో హనుమకొండ, జమ్మికుంట, హుజూరాబాద్ పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామంలో వైద్య సిబ్బంది ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేస్తున్నా జ్వరాలు తగ్గుముఖం పట్టకపోవడంతో భయాందోళనతో ప్రైవేట్ దవాఖానలకు వెళ్తున్నారు. తాగునీరు కలుషితం కావడంతోనే జ్వరాలు వస్తున్నాయని భావిస్తూ ఇతర గ్రామాలకు వెళ్లి మినరల్ వాటర్ తెచ్చుకుంటున్నారు. ఒళ్లంతా నొప్పులు, కీళ్ల వాపులతో భరించలేక పోతున్నట్లు వాపోయారు. మండలంలో ఒక్క భీంపల్లిలోనే విషజ్వరాలు, కీళ్ల నొప్పులతో కూడిన వింత జ్వరాలు రావడంతో గ్రామంలో ఇంటింటా జ్వర సర్వే చేపట్టి వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు.

**ఆందోళన అవసరం లేదు : జిల్లా వైద్యాధికారి**

గ్రామంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యాధికారి సాంబశివరావు అన్నారు. బుధవారం ఇంటింటా చేపట్టిన జ్వర సర్వేను పరిశీలించి పల్లె దవాఖానను సందర్శించారు. గ్రామంలో వస్తున్న విష జ్వరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు నిత్యం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు. వైరల్ జ్వరాలు కావడంతో ఐదు రోజులు జ్వరం వచ్చిన తర్వాత నీరసించిపోయి నొప్పులు వస్తున్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, జ్వరం తగ్గుతుందని చెప్పారు. జ్వర పీడితుల నుంచి సేకరించిన రక్త నమూనాలను రీజినల్ ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ పీహెచ్‌సీ, పల్లె దవాఖాన డాక్టర్లు పద్మశ్రీ, రేణుక, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఎంపీడీవో బాబు, సూపర్‌వైజర్ కనకలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు ప్రభాకర్, శివశంకర్ పాల్గొన్నారు.



భీంపల్లి గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించిన జిల్లా వైద్యాధికారి సాంబశివరావు

### పల్లె దవాఖానకే పరిమితం..

పేదలు జ్వరంతో ప్రైవేట్ దవాఖానలకు పరుగు పెడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామాలు, తండాల్లో వైద్యాధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోగా కనీసం అవగాహన కార్యక్రమాలు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంతోపాటు పడమటిగూడెం, కౌసల్యదేవిపల్లి, జయపురం, ముంగిమడుగు, పెద్దనాగారం గ్రామాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు ఉన్నప్పటికీ వంతడపల గ్రామంలో వైద్యాధికారి ఇప్పటివరకు గ్రామాల్లో, శివారు తండాల్లో పర్యటించిన దాఖలాల్లేవని వారు మండిపడుతున్నారు. పల్లె దవాఖానలో ఉండే ఎంఎల్‌హెచ్‌పీలకు తండాల పేర్లు ఎక్కడ ఉంటాయే తెలియదని, కనీసం అటువైపు కన్నెత్తి చూసిందని లేదని గిరిజనులు చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటివరకు మండలంలోని పల్లె దవాఖానలు పరిశీలించలేదని బహిరంగగానే విమర్శిస్తున్నారు.

మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో దంతాలపల్లి వైద్యాధికారులు మాత్రం చుట్టపు చూపుగా వచ్చి పోతున్నారే తప్ప గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం లేదని చెబుతున్నారు. మండల ప్రజలు. ఎక్కడైనా ఇబ్బందికరమైన పరిస్థితులు వచ్చినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్నారు తప్ప తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వర్షాల సీజన్‌లో వాటర్ ట్యాంకులను శుభ్రం చేయకపోవడం వల్ల తాగునీరు కలుషితం అవుతున్నదని ఇప్పటికైనా స్పందించి గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరాలను అదుపులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

## అధికారుల తీరుతో ప్రమోషన్ కోల్పోయా

**ఓ ఉపాధ్యాయుడి ఆవేదన**



బాధిత ఉపాధ్యాయుడు పెరుమాండ్ల యాదగిరి

నెల్లికుదురు, జూలై 31: విద్యాశాఖ అధికారుల తీరుతో తాను పదోన్నతి కోల్పోయినట్లు బాధిత ఉపాధ్యాయుడు బుధవారం ఆవేదన చెందారు. మండలంలోని శ్రీరామగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో పెరుమాండ్ల యాదగిరి ఎస్జీటీగా పనిచేస్తున్నాడు. జిల్లాలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 18 పీఎస్ హెచ్‌ఎంలు ఉన్నట్లు చూపగా, అర్హులైన 18 మంది ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పిలిపించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేశారు. 18 మంది ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో అర్హులైన తాము ఆప్షన్లు ఇచ్చుకున్నామని, తీరా ఆన్‌లైన్‌లో చూస్తే 18 మంది ఉపాధ్యాయులకు 17 పాఠశాలల్లో మాత్రమే పీఎస్ హెచ్‌ఎం ఖాళీలు చూపిస్తున్నట్లు తెలిపారు. దీంతో తాను పీఎస్ హెచ్‌ఎంగా ప్రమోషన్ రాకుండా నష్టపోయానని, జిల్లా కార్యాలయంలో తప్పిదం వల్లే ఇలా జరిగిందని వాపోయాడు. అర్హత గల తనకు ప్రమోషన్ ఇప్పించి న్యాయం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

## మార్కెటింగ్ శాఖ డీఎంవోగా అనురాధ

కాశీబుగ్గ, జూలై 31: జిల్లా మార్కెటింగ్ శాఖ డీఎంవోగా జి.అనురాధ బదిలీపై వచ్చారు. హైదరాబాద్‌లోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో ఏడీఎంగా విధులు నిర్వర్తిస్తున్న అనురాధను వరంగల్ డీఎంవోగా, ఇక్కడ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్న పాలకుర్తి ప్రసాద్‌రావు నర్సంపేట మార్కెట్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. అలాగే, ఎనుమాముల గ్రేడ్-2 కార్యదర్శిగా భువనగిరి మార్కెట్ కమిటీ నుంచి ధన్నపునేని అంజీరావు, గడ్డిఅన్నారం మార్కెట్ నుంచి వరంగల్ మార్కెట్‌కు అకౌంటెంట్‌గా జి.సుకన్య వచ్చారు. ఎనుమాముల అకౌంటెంట్ ఎన్.రాజ్‌కుమార్ గడ్డిఅన్నారం మార్కెట్‌కు బదిలీ అయ్యారు. జేడీఎం కార్యాలయంలో యూడీసీగా పని చేస్తున్న కందగట్ల రామకృష్ణ, బోజా ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు. మహబూబాబాద్ డీఎంవో సురేఖ వరంగల్ జిల్లా డీడీఎం ఆఫీసుకు బదిలీపై వచ్చారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిట


- చార్జీలు పెరుగుతాయని తరలివచ్చిన జనం
- సమయం పట్టొచ్చన్న అధికారులు

కరీమాబాద్, జూలై 31: ఏదైనా కొత్త వస్తువు కొనాలంటే ఆషాఢ మాసంలో ప్రజలు ఆసక్తి చూపరు. ఇండ్లు లేదా ప్లాట్లు అయితే ఇంకా పట్టింపులతో మరీ దూరంగా ఉంటారు. కానీ, ఆగస్టులో భూమి రిజిస్ట్రేషన్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచే ఆలోచనలో ఉందని భావిస్తూ బుధవారం కొనుగోలుదారులు, అమ్మకందారులతోపాటు వారితో వచ్చిన బంధుమిత్రులతో ఖిలావరంగల్ మండల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిటలాడింది. సంతకాలతోపాటు ఫొటోలు దిగే కౌంటర్ల వద్ద క్యూలైన్‌లో ప్రజలు బారులు తీరారు. 134 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు తెలిపారు. అయితే, చార్జీల పెంపు ఏమీ లేదని, ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని సమాధానమిచ్చారు. ఇప్పట్లో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగకపోచ్చని, మరింత సమయం పట్టే అవకాశం ఉందని పలువురు వ్యాపారులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. మొత్తంగా ఆషాఢ మాసంలోనూ రిజిస్ట్రేషన్లు పుంజుకోవడం కొసమెరుపు.



రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న ప్రజలు

## ● పిల్లలకు మోత.. తాతకు బాధ్యత!



**మనుమడు, మనుమరాలికి స్కూల్ బ్యాగులు భారంగా ఉన్నాయని గమనించి తాత తన పై భారం వేసుకున్నాడు. ప్రతి రోజూ ఇలా తన చేతి కర్రకు వాటిని ముందు వెనక తగిలించి తీసుకెళ్తున్నాడు. ఈ దృశ్యం బుధవారం సాయంత్రం టేకుమట్ల మండలకేంద్రంలో కనిపించింది.**

*- టేకుమట్ల, జూలై 31*